# బుజ్జిమేక

జయంతి పాపారావు

ఎర్ర ధూళిని రివ్వున రేపుతూ మందల వేళప్పుడు మేకల మందొకటి రాజుగారి దొడ్డిప్రక్కనుంచి వెళుతూ ఉన్నప్పుడు ఒక బుజ్జి మేక నేలమీద ఉన్న ఒక్కగానొక్క వేప కొమ్మ రెమ్మను నోటితో అందుకుని ప్రక్కకు తిరిగిపోయి విలాసంగా నములుతూ కొంచెం పక్కకు మెడ వంచి రాజుగారి దొడ్డిలోకి తొంగి చూస్తూ నిల్చుంది.

అంతట్లో ఆమంద ఆబుజ్జిమేక కోసం ఆగకుండా వెళ్ళి పోయింది. ఆమేక మీద బుద్ధిపిల్ల ఆమంద వెళ్ళిపోడం గమనించలేదు. ఆమేకల కాపరి ఎర్ర ధూళివల్ల కళ్లువిప్పలేక ఆమేక వెనక్కి ఉండిపోడం గమనించలేదు. మందకి ముందే నడుస్తున్న మందబేపీ గమనించలేదు.

ఇంతలో ధూళిని దట్టంగా రేపుకుంటూ కారొకటి వచ్చింది. ఆరాజుగారి దొడ్డిద్వారం తెరపబడింది కారులోపలికి వెళ్లిపోయింది. అదేసమయములో ఆధూళిలో ఆబుజ్జిమేక రాజుగారి దొడ్లో ప్రవేశించింది. మేకల కాపరి తమ వెనక్కి ఉండిపోడం, రాజుగారుకానీ, రాణిగారుకానీ, వారి వారి పరివారంలో ఏఒక్కరు కానీ తనుదొడ్లో ప్రవేశించడం గమనించకపోడం గమనించిన ఆమేక మనుషులకి గుడ్డితనం చాలా ఉందన్నమాట అనిఅనుకుంది.

ఆబుజ్జిమేక ఆ రాజుగారి దొడ్లో బాగా విరిబూసిన పూల మొక్కల్ని చూసింది. నాలుగుఆకులు నోట్లోవేసుకుంది చెంగున నాలుగు గెంతులుగెంతి ముందుకు పోయింది. బాగాపెరిగి పెన వేసుకున్న లతల్ని చూసింది. లతా పత్రాల్ని లలితంగా నోట్లోకిలాగుకుంది. పొట్టతోకను ఉల్లాసంగా కదుపుతూ కొంచెం ముందుకు పోయి ఫల

వృక్షాల్ని చూసింది ఆలతలమధ్య ఆతరులమధ్య, ఓ తరుణీ నగ్నశిల్పాన్ని చూసింది. అదిఎత్తైయిన రాతి తిన్నెపై నిలబడిఉంది. వీలయినంత గంభీరంగా, వీలయినంత రాజఠీవిగా గెంతి ఆతిన్నెఎక్కి- పొంకమైనమెడను పైకెత్తి చూసింది కనుచూపు మేరలో ఆమేకల మంద కనుపించలేదు ఆమే



కకు తండ్రిఎవరో తెలీదు. తల్లి పాలు ఇవ్వడం మానేసిచాలా రోజులైంది అందుచేత ఆబుజ్జిమేక తల్లితండ్రుల కోసం పరితపించలేదు అయినా మందతో కలిసిపోవాలని తీవ్రంగా కోరింది అందుచేత, ఎంతోకంగారు పడింది చాలాసార్లు అరిచింది. కొంత సేపు ఆత్రుతగా అటూఇటూ అరచుకుంటూ తిరిగింది బయటకు పోడానికి మార్గం కనిపించలేదు ఇంతలో మళ్ళీ ఆకులచే ఆకర్షింపబడింది. అందువలన ఆప్రయత్నం మానుకుంది.

చుట్టూ విశాలమైన ఎత్తైన గోడను చూసిన ఆబుజ్జిమేక "ఇదిఎవరు కట్టేరుచెప్మా" అని అనుకుంది. 'తను

చుట్టూ ఎన్నో గోతులు నిర్మించుకొని బతుకుతారు వెధవ మనుషులు' అని కూడా ఆ మేక మనస్సులో తిట్టుకున్నది చెంగున ఒక గెంతు గెంతి బావి దగ్గరకు చేరింది. బావిగోడ ఎక్కి లోనికి చూసింది. ఇంతలోతు నుయ్యి తవ్విన వాళ్లెవరు చెప్మా' అని అనుకుంది 'నూతులు తవ్వేవాళ్ళు చాలా తక్కువ మందే ఉన్నా గోతులు తవ్వేవాళ్ళు మనుషుల్లో చాలా చాలా మంది ఉన్నారట' అని ఆ మేక లోకం తీరుని ముచ్చటించింది. ఆవిరబూసిన పూలవెల్లని ఆ ఫలభరిత తరుల్ని చూసి ఈ పూలు ఎవరి శిరస్సును అలంకరిస్తాయో? ఈ పళ్ళు ఎవరు ఆరగిస్తారు? అని ఆ మేక తన పరిమిత జ్ఞానంతో మనస్సులో ప్రశ్నించుకుంది. ఆలతా తరులమధ్య మున్న దివ్య భవనాన్ని చూసి ఆశ్చర్య చకితురాలై పోయింది.

ఆశ్చర్య చకితురాలైన ఆ మేకను ఆ మేడలోని రాణీగారు చూశారు చలాకీగా గెంతులు వేస్తున్న ఆ మేక పిల్లను చూసి మురిసిపోయారు ఆ హంసగమన అందంగా అచ్చంగా హంసలా అడుగులు వేసుకుంటూ వెళ్లి దాన్ని సమీపించి బంధించడానికి చేతులు సాచింది "ఓహో! రాణీ! నీ చేతులలో చిక్కడానికి నేను రాజునను కున్నావా" అన్నట్టు ఆ బుజ్జి మేక తుర్రుమని పారిపోయి గుబురుగా పెరిగిన లతల్లో దూరి దాగింది అప్పుడు ఆ లతాంగి లతల్లో దూరి మేకపిల్ల కోసం పక్కకు తిరిగి తొంగి చూసినప్పుడు గులాబి ముల్లొకటి ఆమె చెక్కిలికి

గుచ్చుకొని రక్తం కారింది అప్పుడు ఆ రాణీగారికి ఆ బుజ్జి మేకమీద కోపం వచ్చింది వెంటనే ఆమె వెనక్కి తిరిగి వెళ్ళిపోయి ఆ మేకను పట్టితెమ్మని రాజుగారితో చెప్పింది ఆమె చెక్కిలి పైరక్తం చూసిన రాజుగారి రక్తం వేడెక్కిపోయింది

వెంటనే రాజుగారు తన ప్రేయసి కోరిక తీర్చడానికి బయలుదేరారు ఆ రాజుగారు హుందాగా, రాజఠీవితో ఆ బుజ్జి మేకను సమీపించి చేతులు విసిరేరు 'ఆహా! రాజా! నీ కౌగిట్లో చిక్కడానికి నేను రాణిననుకున్నావటా' అన్నట్టు గట్టిగా గెంతి, పొట్టి తోకను వీలయినన్ని ఎక్కువ సార్లు వీలయినంత వేగంతో ఊడించి, ఆగనూ పారిపోయి తోటలో నక్కింది.

రాజుగారికి కోపం వచ్చింది పౌరుషం వచ్చింది, శౌర్యం వచ్చింది రాజసం పెల్లుబికింది వెంటనే రాజుగారు మత్తేభంలా హుంకరించి మేక మీదకు ఉరికారు పాము కుసంలా సన్నగా మెత్తగా ఉండి పాములా అతని మెడచుట్టూ ఉన్న సిల్కు పంచె అప్పుడు జారి రాజుగారి కాళ్ళలో పడి చుట్టుకుంది రాజుగారు బోర్లా పడిపోయారు చేతి మణుకులూ, కాలి మణుకులూ కొట్టుకుపోయి రక్తం చిమ్మింది అప్పుడు రాజుగారి అహంకారం ఆకాశాన్నంటింది శౌర్యం చంద్రుణ్ణి తాకింది రాజుగారు పిట్టల వేటలో ఆరితేరినవారు, అందువల్ల

ఆ మేకను తుపాకితో పిట్టలా కాల్చి చంపాలని నిశ్చయించుకున్నారు. తుపాకి తీసుకువచ్చారు కానీ రాణీగారు ఆ మేకను పట్టితెమ్మన్నారుకానీ, కొట్టితెమ్మనలేదు అందువలన ఆ రాజుగారు ఆ ఆయుధాన్ని ఉపయోగించలేదు


రాజుగారు మౌనంగా రెండు నిముషాలపాటు ఆలోచించారు ఏదో శంక అతణ్ని చుట్టుముట్టింది ఏదో భయం అతణ్ని ఆవరించింది రాణీగారి రక్తం చిమ్ముతున్న చెక్కిలి కళ్ళముందు కదిలి, ఆ శంకా, ఆ భయం మరీ ఎక్కువయాయి ఆ బోర్లా పడిపోవడం, మఖుకులు కొట్టుకుపోవడం. రక్తం కళ్ళచూడ్డం తలుచుకుని రాజుగారు చలించిపోయారు. ఏ గ్రహచారమో, ఏ దైవ శాపమో ఉన్న వెంటాడుతున్నట్టు అనుకున్న రాజుగారి కళ్ళు చీకట్లు కమ్మడం మొదలెట్టాయి మాయ లేడీ - సీతాదేవి కోరికా - శ్రీరాముని దురవస్థ - తలపులోకి వచ్చి రాజుగారికి కొంచెం మతి తప్పినట్లయి 'మాయ మేక - మాయ మేక' అని గట్టిగా అరిచాడు

భవనంలో మూడో అంతస్తుపై నాటి కప్పువేసి నాల్గో అంతస్తు కట్టడానికి మట్టి కప్పేతున్న రాజుగారి పనివాడు ఆ అరుపు విని, 'మాయ మేక, దొంగ మేక, దొడ్లో దూరిందా రాజుగారూ!' అని అంటూ, మేక అరుపులు అరుచుకుంటూ వేపకొమ్మ రెమ్మలు చేత్తో పట్టుకుని మచ్చికతో మేకను సమీపించాడు. అప్పుడు ఆ గుంట మేక, నల్ల మేకలా నల్లగా ఉన్న, మేక గెడ్డంలా గెడ్డం ఉన్న అతణ్ని సమీపించింది సదరు ఆసామీ ఆ మేకను చేతుల్లోకి తీసుకుని చంకన పెట్టుకుని, వేపరెమ్మలు మేపుతూ తీసుకుని వెళుతున్నప్పుడు ఆ బుజ్జి మేక 'మేకను పట్టుకోడం మొదలు మేడకట్టుదాకా ఈ మేకగాడేనా' అన్నట్టు అతణ్ని నఖశిఖ పర్యంతం చూసింది

ఆ ఆసామీ ఆ మేకను రాజుగారికి అప్పగించి వెళ్ళిపోయాడు ఆ రాజుగారు ఆ మేకను ఆ రాణీగారికి అర్పించారు ఆ రాణీ ఆ మేకతో ఆడుకుంది ఆ కుర్ర మేక చెవులు గిర్రున తిప్పుతూ కిర్రెక్కిపోయింది. అసలే అది నోరులేని మేక దానికి మేక బ్రతుకు దాన్ది దీన జీవితం. అది పీడిత ప్రాణి నక్కవాతపడ్డ మేకలా, ఆ గుంటమేక గింజుకుంటూంది అప్పుడు ఆ రాణీగారు అలసిసొలసిన దాన్ని వంటవాడికిచ్చారు ఆ వంటవాడు దాన్ని మొదట వధించాడు తర్వాత చిత్రవధచేశాడు తర్వాత ఉప్పూ కారంవేసి ఉడకేశాడు సుపక్వం చేసి సురుచిర భక్ష్యంగా చేసాడు రాజుగారూ - రాణీగారూ యుక మలర భక్షించారు.

* * *

శరీరం చచ్చినా ఆత్మ చావదట కదా! అందుచేత, ఆ బుజ్జిమేక బుల్లి ఆత్మ 'హే! సర్వజ్ఞా! ఈ దీనశిశువు నీకు తెలుసట్రా! ఓ దీనరక్షకా!




నువు రాక్షస రక్షకుడివై పోయావట్రా! ఓహో! సర్వాత్మా! ఒహొహో, సర్వేశా! అరెరే! పరమాత్మా! ఇదే నట్రా నీ సృష్టి!!" అని ఘోషించింది

• • •

ఆ మేకల కాపరి, అతడే యజమాని కూడా ఆ సాయంకాలం మంద ఇంటిముఖం పట్టినప్పుడు, తన మేకల్ని లెక్కచూసి, తన బుజ్జిమేక తప్పిపోడం తెలుసుకుని, మేకలు మేసిన ప్రదేశం అంతా వెదికి వెదికి వేసారి పోయాడు. ఏ నక్కా తన బుజ్జి మేకను, తన్నా, తన మంద బేపినీ కన్నుకప్పి తన్నుకుపోలేదని నిశ్చయించుకున్నాడు కన్నుకప్పే, కుక్కలయినా పసికట్టలేని ఎవరో మనిషి నక్కే తన బుజ్జి మేకను పొట్టన పెట్టుకున్నాడని కూడా స్థిరం చేసుకున్నాడు. చింతపువ్వుల్లా పొట్టమీద తెల్లని మచ్చలున్న తన గారాలబుజ్జి మేకను తలుచుకుని కంటతడి పెట్టాడు.

□□□